
ళినాగు
ధుబాబు

# కాలనాగు

రచన

మధుబాబు

Kinige

© Author
© Madhu Baabu
This digital book is published by -
కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

All rights reserved.

No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.

# ముందుగా

ఈ నవలలోని కొన్ని పాత్రలు 'కాలకన్య' అనే నవలలో పాఠకులకు పరిచయం అయ్యాయి. కాలకన్య చదవని పాఠకులకు తెలియటం కోసం అందులోని కథను క్లుప్తంగా యిచ్చట వివరించటం జరిగింది.

నిశీధుడు అనే నాగరిక యువకుడు ఒక నల్లగుఱ్ఱం కోసం కోయలతో చేయి కలుపుతాడు. తన శౌర్య సాహసాలతో వారని మెప్పించి వారిలో ఒకడు అవుతాడు. అతని సాహసాలను చూసిన కోయలు 'కాలనాగు' అని నామకరణం చేస్తారతనికి.

కోయ పడుచు 'కాలకన్య'ను వివాహం చేసుకోవటానికి, తను కావాలనుకున్న కాలాశ్వాన్ని వశపరుచుకోవటానికి అరివీర భయంకరుడైన కోయవీరుడు భీమన్న చెలిమి సంపాదించటానికి అతను చేసిన సాహసాలు చూపిన నేర్పు 'కాలకన్య'లో వివరించబడ్డాయి.

ఆ నవలతో ఎటువంటి సంబంధమూ లేకపోయినా, ఆ తరువాత కోయగూడెంలో నిశీధుడి జీవనాన్ని వివరించేదే యీ కథ.

# కాలనాగు

"వద్దు, వద్దు. పోవద్దు. నా మాట విను." అంటూ నిశీధుడి చేతులు పట్టుకొని బ్రతిమలాడింది కాలకన్య.

ఆ మాటలు నవ్వు తెప్పించినా, ఆ కాటుక కళ్ళలో ప్రతిఫలిస్తున్న భయం నిశీధుడి పట్టుదల మీద చన్నీళ్ళు చిలకరించింది. మళ్ళీ పక్కమీద కూర్చున్నాడు. మళ్ళీ లేచి పోతాడేమో అన్న భయంతో, అతన్ని బలవంతంగా పడుకోబెట్టి ఎలుగు బంటి చర్మంతో తయారు చేయబడిన దుప్పటిని కప్పింది కాలకన్య. తను మంచానికి ఆనుకుని కూర్చుంది.

కళ్ళు మూసుకున్నాడు నిశీధుడు. నిద్రపోవటానికి ప్రయత్నించసాగాడు.

మరొక్కసారి ఆ నిశబ్ద నిశీధిని చీల్చుకుంటూ వినవచ్చిందా శబ్దం.

మామూలు శబ్దం కాదది. హృదయ విదారకమైన రోదన ధ్వని. ఒక కంఠం కాదు. కొన్ని వందల కంఠాలు ఒక్కసారిగా రోదిస్తున్నట్లు వినపిస్తోంది. కడుపులో చేయి పెట్టి కెలికినట్లు అనుభూతి కలిగిస్తోంది.

మీద వున్న దుప్పటిని గుడిశె మూల పడేడట్లు విసిరి కొట్టి విసురుగా లేచి నిలబడ్డాడు నిశీధుడు. గోడకు తగిలించి వున్న ఆరుమూరల బరిశె అందుకొని ద్వారం వైపు తిరిగాడు.

ద్వారానికి అడ్డుగా నిలబడి వుంది కాలకన్య. చేతులు జోడించి కన్నీరు కారుస్తున్నది.

"మామా.... కాలనాగుకు సాధ్యం కాని పనులు కూడా కొన్ని వున్నాయి. అనవసరంగా ప్రమాదాలకు ఎదురుపోయి ప్రాణాలు పోగొట్టుకోవటం గొప్పకాదు. ఆ మాట విను. నన్ను అన్యాయం చేయకు. " అని విలపించసాగింది.

పేరుకు తగినట్లే కాలనాగులా చివ్వున తల ఎత్తాడు నిశీధుడు. అతని సాహసాలను చూసి కోయలు అతనికి పెట్టిన పేరది.

"ప్రాణాలు పోగొట్టుకోవటం నా అభిమతం కాదు. కాని వెయ్యి మంది నివశించే గూడెంలో అర్ధరాత్రి పూట యీ అపస్వరాలు వినిపిస్తుంటే కారణం తెలుసుకోకుండా కూర్చోవటం నాకు చేతకాదు. ఏమిటా శబ్దం? ఎవరు ఏడుస్తున్నారు? ఎందుకు?" అని అడిగాడు సూటిగా చూస్తూ.

"మామా..... ఇంతవరకూ నీ మాటకు ఎదురు చెప్పలేదు ఇక ముందు చెప్పను కూడా. కాని..... కాని, ఈ ఒక్కసారికి నా మాట మన్నించు మామా. దీన్ని గురించి నన్నేమీ అడగకు" దగ్గిరికి వచ్చి ప్రాధేయపడింది కాలకన్య.

బేలలా దిగాలు పడుతున్న కాలకన్యను చూసి నిశీధుడి హృదయం మెత్తబడింది. ఆమె కోరిక తిరస్కరించి, ఆ అందాలరాశికి విచారం కల్పించడం కొంచెం బాధగానే వుంది. కానీ ముందు రోజు కూడా ఇదే మాదిరి అడ్డుపడిందామె. అతని ప్రశ్నలకు సమాధానాలు ఈయకుండా, అతన్ని బయటకు పోనీయకుండా అడ్డుపడింది.

అది జ్ఞప్తికి రాగానే నిశీధుడి పట్టుదల రెట్టింపు అయింది. బయట రోదన ధ్వని ఆగి ఆగి వినిపిస్తోంది.

మాటలు చెప్పి కాలకన్యను వప్పించటం అసంభవం. అది అతనికి బాగా అనుభవమైన సంగతి. మొరటు అని అన్పించినా విధిలేక ఆమెను పట్టుకొని బలంగా పక్కకు విసిరాడు. అడ్డు పడబోయింది. "మామా.....వద్దు మామా" అని అరుస్తూ.

ఆమె ప్రయత్నం ఫలించలేదు. గుడిశె బయటకి రాగానే ఎడమ కాలితో తన్ని తలుపులు మూసి చీకట్లలో కలిసిపోయాడు నిశీధుడు.

తను గూడా బయటికి రాబోయింది కాలకన్య. తలుపు మీద చేయి వేయబోతుండగా రోదన ధ్వని చెవులు చిల్లులు పడేటంత శృతిలో వినిపించింది. ఆమె రక్తం గడ్డకట్టుకు పోయినట్లయింది. నిలబడటానికి గూడా శక్తి లేక అలాగే కూలబడిపోయింది.

బరిశెను బిగించి పట్టుకొని దట్టిలో వున్న చురకత్తిని తడుముకుంటూ ఆ ధ్వనులు వినిపిస్తున్న దిశకు అడుగులు వేశాడు నిశీధుడు. కోయగూడెంలో చీమ కూడా చిటుక్కుమనటం లేదు. ఎప్పుడూ నడివీధిలో సంచరిస్తూండే శునకాలు గూడా ఆ రోజు కనిపించటం లేదు. కోయ వీరులు అందరూ గుడిశెల్లో నుంచి బయటకు రాకుండా బిగించి పడుకున్నారు. ఎందుకని?

కొండ దేవత ఆలయం సమీపిస్తున్న కొద్దీ ఏడుపులు స్పష్టంగా వినిపించసాగాయి. వాటి స్పష్టతను బట్టి అవి ఆలయంలో నుంచే వస్తున్నాయని గ్రహించాడు నిశీధుడు.

అంతవరకూ చెక్కుచెదరని ధైర్యంతో వచ్చాడు గాని, ఆలయాన్ని సమీపిస్తున్నకొలదీ చెప్పలేని భయం అతణ్ని నీరసుణ్ని చేయసాగింది. గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. బరిశెను బిగించి పట్టుకున్న చేయి వణకసాగింది.

ఎండిపోయిన పెదిమలను నాలుకతో తడుపుకుంటూ ఆలయ ప్రాకారం దాటి లోపలకు పోయాడు.

ఒక్కసారిగా రోదన ధ్వని ఆగిపోయింది.

రెండు అడుగులు వేసి కొండదేవర విగ్రహం వైపు చూసిన నిశీధుడి చేతిలో నుండి బరిశె జారి క్రింద పడిపోయింది శరీరమంతా చెమటతో తడిసిపోయింది.

కొండ దేవర విగ్రహం ముందు సుమారు రెండువందల మంది కోయ వీరులు నిలబడి వున్నారు. వారందరూ సామాన్యమైన కోయలు కాదు. సైన్యాధిపతులు అని వారి దుస్తులు తెలియజేస్తున్నాయి. వారి అందరికంటే ముందు కోయనాయకుడి దుస్తుల్లో ఒక లావుపాటి వ్యక్తి నిలబడి వున్నాడు. అందరి చేతుల్లోనూ తళ తళా మెరుస్తున్నా వేట కత్తులు ఉన్నాయి. వాటితో తమ శరీరాలను తామంతట తామే చిన్నాభిన్నం చేసుకుంటున్నారు వారందరూ.

కొండ దేవర పాదాలు కేసి తల బాదుకుంటున్నాడు నాయకుడు.

రక్తంతో ఎర్రబడిన శరీరాలు వారివి. అంతకంటే మరింత ఎర్రగా కనిపిస్తున్న కళ్ళతో నిశీధుడి వైపు చూశారు వారందరూ.

ఇక నిలబడలేకపోయాడు నిశీధుడు. వారు ఎవరో తెలియగానే స్పృహతప్పి అక్కడే పడిపోయాడు.

# 2

చల్లటి నీరు ముఖం మీద పడగానే స్పృహ తెచ్చుకున్నాడు నిశీధుడు. తనచుట్టూ చాలామంది గుమిగూడి ఉన్నట్లు గ్రహించి కనులు తెరవకుండానే అలాగే కదలకుండా వుండిపోయాడు.

తగ్గు స్వరాలతో మాట్లాడుకుంటున్నారు వారందరూ. ఆ మాటలు సరిగ్గా అర్థం కావటం లేదు. వున్నట్లుండి వారి మాటలను మించి విన్పించింది కాలకన్య కంఠం.

"మామా....నా వైపు ఒక్కసారి చూడు......నన్ను దిక్కులేని దాన్ని చెయ్యకు మామా" అని అతని పాదాలకేసి తల బాదుకుంటున్నది.

పోయిన శక్తి క్రమంగా పుంజుకోసాగాడు నిశీధుడు. కళ్ళు తెరిస్తే వారి మాటలు ఆగిపోతాయేమో అని అలాగే స్పృహ రానట్లు నటించసాగాడు.

"చిలుక దొరా......ఏమంటావ్?" తనకు కుడివైపు నుంచి వచ్చిన ఆ శబ్దాన్ని బట్టి కోయనాయకుడు పోతురాజు అని గ్రహించాడు. సపర్యలు చేస్తున్నది చిలుకదొర అని కూడా తెలిసింది.

"కాలనాగు కాబట్టి యింకా ప్రాణాలతో ఉన్నాడు. అదే ఇంకెవరయినా అయితే యీ పాటికి కాటికి ప్రయాణం కట్టేవాళ్ళే. "

"ఏమైనా రాను రాను బండరాతిలా తయారౌతున్నాడు కాలనాగు. ఇది వరకూ వంటరి వాడు కాబట్టి ఏం చేసినా ఎలా తిరిగినా చెల్లుబడి అయింది. ఇప్పుడు 'తన మీద ఆధారపడి వున్న జీవి వకటి వుంది' అన్న విచక్షణా జ్ఞానం వుండనక్కరలా?"

"తెంపరితనం పుట్టుకతో రావాలి. అలవాటు చేసుకుంటే వచ్చేది కాదు. అది వున్నవారిని కాలకన్యలాంటి అందాల బొమ్మలు కాదు గదా. కొండదొర మంత్రాలు కూడా అడ్డుకోలేవు. "

"అయితే కాలనాగును దెబ్బతీసింది కొండదొరేనంటావా?"

"వూరుకోండి. భీమన్న యిటు చూస్తున్నాడు."

"కాలకన్య రోదించటంలో అర్థం వుంది. భీమన్న ఎందుకు అలా దిగాలు పడిపోతున్నాడు?"

"కాలనాగు భీమన్నకు ఆరోప్రాణం. ఇద్దరికీ శరీరాలు వేరయినా ప్రాణాలు ఒక్కటే. అందుకే అతని బాధ."

కోయపడుచుల గుసగుసలు నిశీధుడు వింటూనే ఉన్నాడు. వారి మాటలలో ధ్వనించిన కొండదొర ఎవరో? తనను దెబ్బతీయటం ఏమిటో అతనికి అర్థం కాలేదు. "మామూలు మూర్ఛ అయితే ఈ పాటికి తెలివి వచ్చి తీరాలి. ఇంకా కదలకపోవటం చూస్తుంటే యిది మంత్ర సంబంధమైన మత్తు అని అనుమానంగా వుంది" పోతురాజు చెవిలో గుస గుసలాడుతున్నాడు చిలుకదొర.

ఆ మాటల కాలకన్య చెవిన పడ్డాయి కాబోలు. ఆమె రోదన మరింత వుధృతమయింది.

"మంత్రశక్తులున్న తెల్ల దున్నను చంపిన వాడిని......యీ తూతూ మంత్రాలకు లొంగిపోయావా? కాలనాగులా చెంచులను చీల్చి చెండాడే నీ శరీరం ఇటువంటి కుద్ర శక్తులకు లొంగిపోయిందా ? మామా.....లే మామా....నన్ను

చూడు మామా.....కనీసం నీ నేస్తం భీమన్న కోసమైనా కళ్ళు తెరు మామా....." అని అల్లాడిపోతోంది.

ఆ పైన తన నటన కొనసాగించలేక, మెల్లగా కళ్ళు తెరిచాడు నిశీధుడు. అది చూసి అందరూ ఆనందంగా నిట్టూర్చారు. కాలకన్య ఒక్క గంతులో ముందుకు వచ్చి అతని గుండెలకు కరుచుకుపోయింది.

ఆమెను అలాగే పొదవి పట్టుకొని లేచి కూర్చున్నాడు నిశీధుడు. చుట్టూ వున్న స్నేహితులన్నందర్నీ చూసి చిరునవ్వు నవ్వాడు. ఆలయ ప్రాకారంలో నుండి తను తన గుడిశెకు చేర్చబడినట్లు గ్రహించాడు. అప్పటికి అప్పుడే అసలు సంగతి తేల్చిపారేయాలని అనుకున్నాడు. కాని చిలుక దొర మందలింపులు అందుకు ప్రతిబంధకాలు అయ్యాయి. విశ్రాంతి అవసరం అంటూ అందర్నీ బయటకు పంపి తను కూడా వెళ్ళిపోయాడు.

గుడిశెలో కాలకన్య, భీమన్నలు మాత్రమే మిగిలారు అతనికి తోడుగా.

"నేనే తీసుకొచ్చాను కాలనాగూ! తెల్లవారుఝామున చెల్లాయ్ వచ్చి గొడవ చేసేసరికి నాకు కాళ్ళూ, చేతులు ఆడలేదు. పోతురాజును తీసుకుని గుడి దగ్గరకు వచ్చాను. ప్రాకారం లోపల పడిపోయి ఉన్నావు" నిశీధుడి చూపుల్లోని ప్రశ్నను అర్థం చేసుకుని జరిగింది వివరించాడు భీమన్న.

వేడిపాలు రెండు ముంతలనిండా తీసుకొచ్చి, యిద్దరికీ యిచ్చింది కాలకన్య. ఆమెను దగ్గిరికి లాక్కొని, సగం తను తాగి, సగం ఆమె చేత తాగించాడు నిశీధుడు.

"ఈ పిరికిదాన్ని పెళ్ళాడటం కోసం ఎన్నిపాట్లు పడ్డానో తలుచుకుంటే నవ్వు వస్తుంది. ఎలుకను చూసినా భయమే పిల్లిని చూసినా భయమే " అన్నాడు కాలకన్య ముంగురులు సవరిస్తూ.

"ఆఁ పెద్ద ధైర్యవంతుడు బయలు దేరాడు. వద్దు వద్దన్న కొద్దీ పోయి, ప్రాణాల మీదికి తెచ్చుకొని, నా ప్రాణాలు తీశాడు" ఎత్తి పొడిచింది కాలకన్య.

వారి మాటలు వింటూ వినోదంగా నవ్వుకున్నాడ భీమన్న.

"చెల్లాయ్ మాట నిజం కాలనాగూ. ఎంత బలం వున్నా మనకు అసాధ్యమైన పనులు కొన్ని ఉంటాయి. వాటిలో తల దూర్చటం మంచిది కాదు" అన్నాడు మందలింపుగా. ఆ మాటలతో అసలు సంగతికి వచ్చాడు నిశీధుడు. బాసిపట్టు వేసుకొని అతని వైపు తిరిగి కూర్చున్నాడు.

"రాత్రి ఒక వింత దృశ్యం చూశాను. దాని అర్థం తెలిసి కూడా, అప్రయత్నంగా భయపడి పడిపోయాను. అదేమిటో మీకు తెలుసు. దాన్ని గురించి నాకు తెలియని విషయాలు చాలా వున్నాయి. భీమన్నా! స్నేహితుడిగా అడుగుతున్నాను. కట్టుకున్న పెళ్ళాం జవాబు చెప్పటానికి నిరాకరించింది. కనీసం నువ్వైనా చెప్పు." అని అడిగాడు.

చెప్పవద్దని నిశీధుడు చూడకుండా సైగ చేసింది కాలకన్య. ఆమె అలా చేయటం అనవసరం. ఆమె సైగ చూడక ముందే చెప్పకూడదని నిర్ణయించుకున్నాడు భీమన్న.

"కాలనాగూ ! నా ప్రాణం అడుగు. సంతోషంగా ఇస్తాను. ఈ ప్రశ్నకు సమాధానం మాత్రం నా నోటి వెంట రాదు" అన్నాడు.

నవ్వాలో ఏడ్వాలో అర్థం కాక వెర్రిగా చూశాడు నిశీధుడు. భీమన్న గూడా నిరాకరించాడంటే తను తెలుసుకోకూడనిది ఏదో వుంది. ఆ మాట అనుకోగానే అతని పట్టుదల పదింతలు అయింది.

రాత్రి ఆలయంలో తను చూసిన కోయవీరులు మానవులు కాదు. మానవులే అయితే అలా భూమికి రెండు జానల ఎత్తున గాలిలో నిలబడరు. వారెవరో దేవతలో దయ్యాలో అయి వుంటారు. అది ఖాయం. అయితే తను గూడెపు ఆలయంలోకి వచ్చి ఆ ఏడవటం దేనికి?

"మొదటిసారి అనుకోకుండా ఎదురైనాయి కాబట్టి ఆ దయ్యాలకు భయపడ్డాను. ఈ సారి అటువంటి పొరపాటు జరగదు. మీరు చెప్పకపోతే రాత్రికి పోయి వాటినే అడుగుతాను?" అన్నాడు బింకంగా.

"ఏ.....ఏమని అడుగుతావు?" తడి ఆరిపోయిన గొంతుతో అన్నది కాలకన్య.

"నిద్రపోనీయకుండా రాత్రిళ్ళు ఈ జాతర ఏమిటని? మర్యాదగా నోరు మూస్తే సరే సరి. లేకపోతే నా చురకత్తి వాడి కొంచెం రుచి చూపిస్తాను" జవాబు ఇచ్చాడు నిశీధుడు.

ఎంత వద్దు అనుకున్నా ఆ మాటలకు నవ్వకుండా వుండలేకపోయాడు భీమన్న. అంత నవ్వులోనూ నిశీధుడు అన్నంత పనీ చేస్తాడేమో అన్న భయం కూడా ధ్వనించింది.

"గొప్పపని చేస్తావ్. రాత్రికి పోయి తిరిగి వస్తావేం? చూస్తాగా..... ఎలా బయటకి పోతావో ! ఈ గడపదాటితే నా మీదే ఒట్టే" అని విసురుగా బయటకి వెళ్ళిపోయింది కాలకన్య.

నెమ్మదిగా తను కూడా జారుకున్నాడు భీమన్న. తను అన్నట్టు తనంతటతానే ఆ ప్రశ్నలకు సమాధానం తెలుసుకోక తప్పదని గ్రహించి మంచంమీద మేనువాల్చాడు నిశీధుడు. కాలకన్య ఒట్టుపెట్టి పోవటం పరిహాసంగా తీసుకున్నాడు.

చీకటి పడిన తరువాత గాని అది పరిహాసం కాదనని తెలిసి రాలేదు. గూడెంలో వున్న పెళ్ళికాని పడుచుల్లో సగం మంది నిశీధుడి గుడిశెలో గుమిగూడారు. వారందరికీ ముందు భార్య పెట్టిన ఒట్టు కట్టుబాటును కాదనే ధైర్యం లేక గుడిశెలోనే వుండిపోయాడు.

ఎప్పటి మాదిరి అర్ధరాత్రి అవగానే వినిపించాయ్ ఏడ్పులు. చేతులు నలుపుకుంటూ, నిద్రపట్టక పక్కమీద పొర్లటం తప్ప మరేం చేయలేకపోయాడు. ఆ ఒక్క రోజే కాదు అలా వరుసగా ఎనిమిది రోజులు గడవగానే అతని సహనం నశించిపోయింది. ఆ రోజు కాలకన్య కాదు. గూడెంలోని వారందరూ కట్టుకట్టినా పోయి తీరాలని నిశ్చయించుకున్నాడు. కాలకన్య ఏడుపులనూ, ఎత్తి పొడుపులనూ లక్ష్యపెట్టకుండా, చీకటి పడగానే ఆయుధాలు ఎంచి పెట్టుకొని అర్ధరాత్రి కోసం ఎదురు చూశాడు.

అర్ధరాత్రి వచ్చింది. తొలికోడి కూడా కూతబెట్టింది. రోదన ధ్వనులు కాదుకదా, కనీసం కీచురాళ్ళ చప్పుడు కూడా వినిపించలేదు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Kalanagu**

* * *